క్లుప్తంగా

మాజీ మంత్రిని కలిసిన చిన్నబాబు



మాజీ మంత్రి అప్పలరాజుతో చిన్నబాబు తదితరులు

పలాస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం పలాస నియోజకవర్గం అధ్యక్షులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కంచరాన చిన్నబాబు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా అప్పలరాజు సూచించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు శిష్టు గోపి, మాజీ అధ్యక్షుడు సనపల సింహాచలం, నాయకుడు అంబటి ఆనంద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ ఉన్నారు.

వీఆర్‌ఏలకు అదనపు బాధ్యతలు వద్దని వినతి

కవిటి: సీసీఎల్‌ఏ నిబంధనలకు విరుద్ధంగా వీఆర్‌ఏలకు రాత్రి డ్యూటీల్లో అదనపు బాధ్యతలు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వీఆర్‌ఏల మండల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కవిటి తహసీల్దార్ బి.మురళీమోహనరావుకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణలో వీఆర్‌ఏలకు అమలు చేస్తున్న పేస్కేల్‌ను ఇక్కడ అందించాలని, ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్‌ఏల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘ ప్రతినిధులు కాళిదాస్, జగదీష్, పార్వతి ఉన్నారు.

పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన

ఇచ్ఛాపురం: గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించే బాధ్యత ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలపై ఉందని గైనకాలజిస్టు ఎస్.అనూష అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, హెడ్‌నర్సులతో వైద్యాధికారి అధ్యక్షతన గర్భిణుల సహజ ప్రసవం, పౌష్టి కాహారంపై సోమవారం అవగాహన కల్పించారు. హెడ్‌నర్స్ భవాని తదితరులు పాల్గొన్నారు.

లెర్నింగ్ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: పాఠశాలల సముదాయ సమావేశాలకు అవసరమైన నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక లక్ష రూపాయల చొప్పున కేటాయించారు. అందులో భాగంగా సోమవారం కొళిగాం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ ఉపకరణాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ (టీఎల్‌ఎం)ను ఉపాధ్యాయులకు అందజేశారు. బోధన సామగ్రిని వినియోగించుకోవాలని సూచించారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



టెక్కలి రూరల్: ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు న్యాయసేవాసంఘం అధ్యక్షురాలు, జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్ ప్రసన్నలత అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సును సోమవారం నిర్వహించి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు వెంటనే అందించవలసిన ఆరోగ్య సహాయ సహకారాలు, ఆహార పోషణ అవసరాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు ఎల్.శ్రీనివాసరావు, పి.అర్జునరావు, వెంకట్రావు, పి.వాసుదేవరావు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ గ్రీవెన్స్‌కు 13 వినతులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 13 వినతులు వచ్చాయి. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు వినతులను స్వీకరించారు. వీటిని పరిశీలించి సకాలంలో పరిష్కరిస్తామన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ప్రకటనలో తెలిపారు. సభ్యులంతా విధిగా హాజరు కావాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పలాస విద్యుత్ శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు సోమవారం ఓ ప్రకటలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్, లైన్‌ల ఏర్పాటు చేస్తున్నందున ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పూండి, పీఎంపురం, అమలపాడు, కేఆర్‌పేట పాతటెక్కలి, కొత్తపేట, దేవునల్తాడ తదితర గ్రామాలకు సరఫరాను నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించగలరని కోరారు.

ఆహ్లాదం దూరం..!

- పార్కుల్లో కానరాని సౌకర్యాలు
- విరిగిపోయిన పిల్లల ఆటవస్తువులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఇచ్ఛాపురం టౌన్:



దీనిపై పిల్లలు ఆడుకునేది ఎలా..



పాడైన ఆట పరికరాలు

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఆహ్లాదం కరువైంది. అరకొరగా ఉన్న పార్కులను అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో సాయంత్రం వేళ కొద్దిసేపు సేదదీరేందుకు వెళ్లేవారికి అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రధానంగా పట్టణం మధ్యలో ఉన్న గాంధీ పార్కే స్థానికులకు దిక్కు. ప్రస్తుతం దీన్ని గాలికి వదిలేశారు. గతంలో ఇందులో అన్ని మౌలిక సౌకర్యాలు ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో జనంతో కళకళలాడేది. వివిధ ఆట వస్తువులు పిల్లలను ఆకర్షించేవి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కనీసం కూర్చోవడానికి ఉండే సిమెంట్ బల్లలు కూడా కొన్ని శిథిలావస్థకు చేరాయి. పిల్లల ఆట వస్తువులన్నీ తుప్పుపట్టి.. విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో పార్కు వైపు అడుగు వేయడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బెందాళం అశోక్ కనీసం పట్టణ ప్రజల ఆహ్లాదంపై కనీసం దృష్టిసారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వేసవి కాలం ప్రారంభం కావడం, పిల్లలకు దాదాపు పరీక్షలు కూడా పూర్తయి.. సెలవు వస్తున్న నేపథ్యంలో పార్కును బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పుడు ఉన్న ఆట వస్తువులన్నీ తీసేసి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి



గాంధీ పార్కులో చిన్నపిల్లల కోసం కొత్త ఆట పరికరాలను అధికారులు ఏర్పాటు చేయాలి. కూర్చోవడానికి బల్లలను పెట్టాలి. వేసవి నేపథ్యంలో సాయంత్రం వేళ సేదదీరేందుకు ఈ పార్కే పట్టణ ప్రజలకు దిక్కు. అధికారులు స్పందించాలి.

– కె.శ్రీను, బ్రాహ్మణవీధి, ఇచ్ఛాపురం

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మున్సిపాలిటీలో ఉన్నది గాంధీపార్క్ ఒక్కటే. దీని అభివృద్ధికి అధికారులు నిధులు కేటాయించాలి. అలాగే పాడైన పిల్లల ఆట వస్తువులు తొలగించి వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించాలి. వేసవి నేపథ్యంలో చర్యలు తీసుకోవాలి.

–ఎం.మధు, దానంపేట, ఇచ్ఛాపురం

నిధులు కేటాయించాం



గాంధీ పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించాం. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. ఐదు లక్షలు, జనరల్ ఫండ్ ఐదు లక్షల రూపాయలతో పార్కులో ఆట పరికరాలు, గోడలకు రంగులు, ఇతర వస్తువులకు ప్రతిపాదనలు చేశాం. కౌన్సిల్ ఆమోదం జరిగాక పనులు ప్రారంభిస్తాం.

–ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్

పలాస-కాశీబుగ్గలో రూపు కోల్పోయిన పార్కులు



అధ్వానంగా తయారైన నెహ్రూ పార్కు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పార్కులు రూపం కోల్పోయి ప్రజలను ఆహ్లాదానికి దూరం చేశాయి. పేరుకే గ్రేడ్–2 మున్సిపాలిటీ అయినప్పటికీ పార్కులను మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కనీస సౌకర్యాలు కానరావడం లేదు. మున్సిపాలిటీలో 31 వార్డుల్లో లక్ష మంది జీవిస్తున్నారు. వీరికి సాయంత్రం వేళ సేదదీరేందుకు పార్కులు ఉపయోగంలో లేకుండా పోయాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నెహ్రూ పార్కులో సౌకర్యాలు లేవు. ఉన్న మొక్కలను, సౌకర్యాలను తొలగించారు. చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తువులు సైతం ఉపయోగంలో లేవు. అలాగే 10, 11, 12 వార్డుల ప్రజలకు సౌకర్యవంతంగా ఉన్న కీర్తరాయి పార్కు (చెరువు) చెత్తతో నిండిపోయింది. పార్కులను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కులను అభివృద్ధి చేయాలి



మున్సిపాలిటీలోని నెహ్రూ పార్కు, కీర్తిరాయి చెరువు పార్కు, భద్రమ్మ కోనేరు పార్కులను అభివృద్ధి చేయాలి. చినబడం, పద్మనాభపురం, మొగిలిపాడు, ఎర్ర చెరువు, జయరామచంద్రపురం ప్రాంతాల్లోని చెరువులను మినీ పార్కులుగా తీర్చిదిద్దాలి.

– బమ్మిడి దుర్యోధనరావు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

వినియోగంలోకి తీసుకొస్తాం..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న ప్రధాన పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిల్ సభ్యులతో నెలవారీ సమావేశంలో పార్కుల కోసం ప్రత్యేక బడ్జెట్‌ను పెట్టేలా చర్యలు చేపడతాం. ముఖ్యంగా చిన్నారుల కోసం ఆట వస్తువులను ఏర్పాటు చేస్తాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

కాలువ ఆక్రమణదారులపై చర్య తీసుకోండి

- ఆర్డీవోకు రైతుల ఫిర్యాదు



కాలువ ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న గోపినాధపురం రైతులు

టెక్కలి: టెక్కలి కోదండరామవీధి సమీపంలో 49 ఆర్–1 ఆర్ సాగు నీటి కాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గోపినాధపురం రైతులు కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికి సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తారు సత్యం, ధవళ శివరంగబాబుతో పాటు రైతులంతా ఆర్డీవోను కలిసి సమస్యను వివరించారు. పలాసకు చెందిన కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ వేస్తూ సాగు నీటి కాలువను ఆక్రమించేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని వలన సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఉందని వివరించారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ.. తక్షణమే ఆక్రమణలు తొలగించాలని లేకపోతే కన్వర్షన్ రద్దు చేస్తామని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్.వీరన్న, డి.కుశుడు, బి.చిన్నబాబు, బి.లక్ష్మణరావు, ఎస్.సింహాచలం తదితర రైతులు ఉన్నారు. స్థానిక విద్యానగర్‌కు ఎదురుగా ఖాళీగా ఉన్న స్థలంలో పారిశుద్ధ్యం క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు వినతిని అందజేశారు. ఈ వారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 19 వినతులు అందాయి. వాటిలో టెక్కలి మండలం బొరిగిపేటలో ప్రాథమికోన్నత పాఠశాలను రద్దు చేయకుండా ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఎ.మాధవరావుతో పాటు మరికొంత మంది విన్నవించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 13, విద్యా శాఖ, పంచాయతీరాజ్, సర్వే విభాగాలకు రెండేసి చొప్పున వినతులు అందినట్లు సిబ్బంది వెల్లడించారు.

దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటిద్దాం



ర్యాలీ చేస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

టెక్కలి: ఈ నెల 11వ తేదీ పూలే జయంతి నుంచి 14వ తేదీ అంబేడ్కర్ జయంతి వరకు దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటించాలని కేఎన్‌పీఎస్ నాయకులు ఎం.కృష్ణయ్య, బి.ప్రభాకర్రావు, ఆర్.రాంబాబు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక గొడగలవీధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో పూర్తిగా ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేయడానికి పెద్ద కుట్రలు చేస్తున్నారని ఇందులో భాగంగా అడ్డువచ్చిన వారిని హతమారుస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఇతర రంగాలకు మళ్లింపును తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు అశోక్, సురేష్, రామారావు, భాస్కర్, సావిత్రి, సులోచన, రమణమ్మ, సుజాత ఉన్నార.

రీసర్వేతో భూ సమస్యలకు చెక్

- పలాస ఆర్డీవో వెంకటేష్



మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేష్

వజ్రపుకొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే ద్వారా అన్ని భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పలాస ఆర్డీవో జి.వెంకటేష్ అన్నారు. బెండి పంచాయతీ మహదేవిపురం గ్రామంలో తహసీల్దార్ సీతారామ్మూర్తి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రీసర్వే ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు ఏమైనా ఉంటే దరఖాస్తులు ఇచ్చి సమస్యను పరిష్కరించుకునేందుకు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డీటీ కె.శ్రావణ్‌కుమార్, సర్వేయర్ కె.తిరుపతిరావు, డీఐఓ ఎస్.చంద్రశేఖరరావు ఉన్నారు.

దాహం కేకలు!

- రెండు నెలలుగా నిలిచిన ఉద్దానం ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా



బల్ల ఎర్రగోవిందపుట్టుగలో నీరులేక వెలవెలబోతున్న ట్యాంక్

కవిటి: మండలంలోని లండారిపుట్టుగ పంచాయితీ బల్లపుట్టుగ, కరాపాడు పంచాయితీ బింగిపుట్టుగ, కవిటి పంచాయతీ బల్ల ఎర్రగోవిందపుట్టుగ, ఎర్రగోవిందపుట్టుగ గ్రామాల ప్రజలు దాహం కేకలు వేస్తున్నారు. రెండు నెలలుగా ఈ గ్రామాలకు ఉద్దానం ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో సమస్య నెలకుంది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఒక్కో విద్యుత్‌బోరు బావి ఉన్నప్పటికీ.. అవి కొద్దిసేపు నీటినితోడి తర్వాత మొరాయిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో ఈ పరిస్థితి నెలకుంది. ప్రధానంగా పశువులకు నీటిని కూడా అందించలేక మూగజీవాలు సైతం దాహంతో అలమటిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



కొద్దిరోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడుతున్నాం. పశువులకు నీటిని అందించలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

బి తులసయ్య, బింగిపుట్టుగ, కవిటి మండలం

కటకటలాడుతున్నాం..



మంచినీటి కోసం కటకటలాడుతున్నాం. సమస్యను పరిష్కరించాలి. తక్షణమే ఆగిపోయిన ఉద్దానం నీటి సరఫరాను పునరుద్ధరించాలి.

– కొన్నాయి టొంకా, బల్ల ఎర్రగోవిందపుట్టుగ

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

సోంపేట: సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు తమ హాల్ టికెట్ జిరాక్స్‌తో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చునన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, సీఎస్ఈ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఒడియా మాధ్యమాల విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సారాతో వ్యక్తి అరెస్టు

పలాస: సారా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు పలాస ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు సోమవారం తెలిపారు. మొగిలిపాడు గ్రామానికి చెందిన దగన అప్పలస్వామి వద్ద నుంచి మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సారా విక్రయించినా, తయారు చేసినా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగునీరు అందజేయాలి

టెక్కలి: టెక్కలి మండలంలో గిరిజన రైతులకు సాగునీరు అందజేయాలని సీపీఎం, గిరిజన సంఘం నాయకులు కోరారు. ముఖలింగాపురం గిరిజన గ్రామంలో సోమవారం పర్యటించారు. గిరిజనుల భూములకు సాగు నీరు అందజేయాలని, జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. సంఘ ప్రతినిధులు కె.ఎల్లయ్య, ఎన్.షణ్ముఖరావు, కె.అప్పారావు, డి.నీలవేణి, ముత్యాలమ్మ, సుహాసిని ఉన్నారు.

శ్యాంపురియాకు ఘన నివాళులు



శ్యాంపురియా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాయిరాజ్ తదితరులు

కవిటి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి దివంగత శ్యాంపురియా చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. పాతవరకలో సోమవారం నిర్వహించిన శ్యాంపురియా ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్యాంపురియా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బెంతొ ఒరియాసంఘ అధ్యక్షుడు రజనకుమార్‌దొళాయి, బడగల రాజేంద్రం, జగదీష్ బిసాయి పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

కంచిలి: పెద్దకొజ్జిరియా గ్రామంలోని రాళ్ల చెరువులో ఉపాధి హామీ పథకం పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పనులను సద్వినియోగం చేసుకోవాలని పనులను ప్రారంభించిన సర్పంచ్ పొందల ఢిల్లీరావు అన్నారు. మాజీ సర్పంచ్ బొడ్డ రామ్‌కుమార్, హరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండల కేంద్రంలోని కొత్తమ్మతల్లి ఆలయం ఎదురుగా చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎండలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీన్ని ఆలయ ఈవో వి.రాధాకృష్ణ ప్రారంభించారు.

ఉద్యోగాలకు ఎంపిక



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు చెన్నైలోని వోల్టెక్ ఇంజినీర్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఈ, డిప్లమో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఓడీలు డి.విజయకుమార్, బి.శ్రీనివాసరావు, ఎం.ఎస్.వి.సంతోష్‌కుమార్ అభినందించారు.

–టెక్కలి

వైద్య శిబిరం..



పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్యశిబిరం జరిగింది. రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 48 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎం.ఎల్.హెచ్.పి ఎస్.పావని, ఏఎన్‌ఎం టి.ఆదిలక్ష్మి, హెచ్ఏ వై.చిన్నారావు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

–పలాస

అధికారులకు వినతి..



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రచ్చబండను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతోపాటు దాన్ని పునఃనిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ కారంగి త్రినాథ్‌లు కోరారు. ఇచ్ఛాపురం రూరల్ మండలం కె.శాసనాం గ్రామంలోని రచ్చబండను అదే గ్రామానికి చెందిన ఇసురు ఫకీరు ఇటీవల తన అనుచరులచే ధ్వంసం చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, రెవెన్యూ సిబ్బంది కొలతలు తీసి ప్రభుత్వ స్థలంగా నిర్ధారించారంటూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందించారు.

–ఇచ్ఛాపురం రూరల్

మృతుల కుటుంబాలకు మాజీమంత్రి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు సముద్ర తీరంలో వేటకు వెళ్తూ మృతి చెందిన మంచినీళ్లపేటకు చెందిన బుంగ ధనరాజు, వంక క్రిష్ణ కుటుంబాలను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం పరామర్శించారు. రెండు కుటుంబాలను కలిసి ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుల చిత్రపటాల వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ వంక రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తిర్రి రాజారావు, మత్స్యకార నాయకులు అంబటి ఆనంద్, పలాస పట్టణ పార్టీ అధ్యక్షుడు శిష్టు గోపి, మాజీ సర్పంచ్‌లు జి.శంభూరావు, వీరస్వామి, తులసీరావు, మోహనరావు ఉన్నారు.

డాక్టర్ బాలకృష్ణ కుటుంబానికి..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడం గ్రామంలో నివాసం ఉంటున్న ప్రముఖ ఎముకల వైద్యులు డాక్టర్ తాళాభక్తుల బాలకృష్ణ తండ్రి మల్లేశ్వరరావు ఇటీవల మరణించారు. దీంతో బాలకృష్ణ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బోర క్రిష్ణారావు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, కౌన్సిలర్‌లు శంకర్ పండా, పిచ్చుకల అజయ్, సవర సోమేష్, నాయకులు శిష్టు గోపి, పోతనపల్లి హరిక్రిష్ణ ఉన్నారు.

సోంపేట: జింకిభద్ర గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు వెంకటరావు సోదరుడు నిమ్మన లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులను ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ పరామర్శించి సంతాపం తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు టి.శేఖర్, సాహుకారి జాని, పెద్దకోట అనంత్, బత్తుల శంకరరావు, షణ్ముఖరావు ఉన్నారు.